# తాత తండ్రుల దేశం

'టిక్ టిక్ టిక్....' సిగ్గుతో, సంకోచంగా, సందేహంగా, బేలగా, అనుమానంగా, తలుపు తడుతున్నారెవరో. ఏడ్చి ఏడ్చి అలసి పడుకున్న పసి పిల్లాడిలాగా వుంది ఆనందనగర కాలనీ. కిటికీల నుంచి కప్పు దగ్గర వెంటిలేటర్ల నుంచి బిక్కు బిక్కు మంటూ లైటు కాంతి ప్రసరిస్తున్నది చుట్టు పక్కల. శత్రు దేశం యుద్ధ ప్రకటన చేసినట్లు ఆందోళనకర నిశ్శబ్దం. ఇరుగు పొరుగును చూస్తే భయం. వీధిలోకి వెళ్ళాలంటే బెరుకు.

సారంగపాణి ఉలికిపడి లేచాడు. సాయంత్రం బస్ దిగగానే ఇంటికెట్లా వెళ్ళాలా అని దిగులు పడ్డాడు. ఇద్దరు ముగ్గురు నలుగురు ఐదుగురు చేరి హడావుడిగా ఏమిటేమిటో చెప్పుకుంటూ ఆత్రుతతో ముందుకు కదులుతున్నారు. రిక్షాల కోసం, ఆటోల కోసం, సిటీ బస్సుల కోసం హడావుడిగా పరుగులు తీస్తున్నారు.

అటువంటి పరిస్థితుల్లో మసక మసక వెలుగు చీకటిగా రూపాంతరం చెందుతున్న నేపధ్యంలో ఇల్లు చేరాడు సారంగపాణి. పగలంతా అలసిపోయి ప్రయాణం చేయటంవల్ల వెంటనే నిద్ర పట్టింది. ఆకలి కూడా అన్పించలేదు.

గది తలుపులపైన టిక్ టిక్ మన చప్పుడు కలలోలా విన్పించింది. ఉలిక్కిపడి లేచాడు పాణి. పుస్తకాల షెల్ఫ్ పక్క అలారం గడియారం పదినిముషాల తక్కువ పదకొండు చూపుతున్నది. కళ్ళు నులుముకుని వింటే మళ్ళీ చప్పుడు విన్పించింది. ఎవరు అంటే 'అంకుల్, అంకుల్, నేను' అని లేత కంఠస్వరం వినపడింది.

తలుపు తీసి చూసి ఆశ్చర్యపోయినాడు సారంగపాణి. ఇంటి యజమాని యజ్ఞనారాయణయ్యగారి మనవడు మధు. 'ఏమిటి బాబీ, ఏం జరిగింది' అని ఆత్రుతగా అడిగాడు సారంగపాణి. 'అంకుల్, తాతగారు మీరుంటే నిద్రలేపి పిలుచుకుని రమ్మన్నారు' అని చెప్పాడు మధు.

షర్టు వేసుకుని మధు వెంట నడిచాడు సారంగపాణి. చూడగానే ముసలాయన దైన్యపరిస్థితి అర్థమైపోయింది సారంగపాణికి. మహలక్ష్మమ్మగారు బరువుగా ఊపిరి విడుస్తోంది. ఆ పక్కనే శూన్య దృక్కులతో కూచిని వున్నారు యజ్ఞనారాయణగారు. గది నిండా భరించలేని నిశ్శబ్దం పరుచుకొని వుంది. సారంగపాణిని ఆ గదిలో ప్రవేశపెట్టి ఒక్క అంగలో లోపలి గదిలోకి వెళ్ళి పడుకున్నాడు మధు. ముసలాయన లేచి పక్కన ఉన్న కుర్చీని కొంచెం ముందుకు జరిపాడు, సారంగపాణిని కూచోమని అభ్యర్థిస్తున్నట్లు.

'ఎలా వుంది పిన్నిగారికి? మొన్న నేను ఊరెళ్ళే ముందు బాగా ఆరోగ్యంగా తిరుగుతూనే ఉన్నారు కదా. నా కెంతో ధైర్యం చెప్పారు కూడాను. ఇంతలో ఏమైంది?'

ఎండిపోయి వాలిపోయి, వడలిపోయిన ఆయన కళ్ళలో అశ్రువు లుబుక లేదు. కళ్ళజోడు వెనుక కాంతి లేని గాజుకళ్ళ లాగానే అన్పించాయి అవి. అతడి ప్రశ్నకు సమాధానం చెప్పకుండా అతడి వాలకం చూసి విపరీతంగా బాధపడిపోయినాడాయన.

"అయ్యయ్యో, ఎంత పని జరిగింది నాయనా. పదిరోజులు రాకపోతే ఏదో మునిగే ఉంటుందనుకున్నాను. అయినా ఆయన కేమిలే అదృష్టవంతుడు. పిల్లల చేతి మీదుగా వెళ్ళిపోయినాడు."

సారంగపాణి నున్నటి తల వెనక అంగుళం మేర అంటకత్తిరించిన పిలక లాంటి ముద్ర. యజ్ఞనారాయణగారికి సారంగపాణి

గుంటూరు వెళ్ళిన పని ఏమైందో అర్థమైపోయింది. అసలే ఉద్విగ్నంగా ఉన్న ఆయన హృదయం మరింత వేగంగా కొట్టుకుంది.

'చివరి చూపు దక్కింది బాబయ్యగారూ. వెళ్ళిపోతున్నట్లు చెప్పారు. సంతృప్తిగానూ, నిర్విచారంగానూ చూశారు నా వైపు. నా చేయి గట్టిగా పట్టుకొని ఏదో వ్రేలితో గాలిలో రాయబోయారు కాని నాకర్థం కాలేదు. ఒక్క అరగంట మాత్రమే స్పృహలో లేరు. అనాయాసంగానే వెళ్ళిపోయారు.'

'అది కాదా! కావల్సింది నాయనా. ఎన్నాళ్లు బతికినా వెళ్ళిపోయే ముందు తనకు తను బరువు కాకూడదు. ఇతరులకూ బరువు కాకూడదు. ఆయన పుణ్యాత్ముడు. పిల్లలందరూ తన కళ్ళముందు చేరారు చివరి ఘడియలలో. అంతకన్నా జీవికి కావల్సిందేముంది?'

'పిన్నిగారి కేమైంది? డాక్టరు వచ్చి చూశాడా?'

'నువ్వు వెళ్ళిన మర్రోజే బెంగ పడిపోయింది. నాకేమైనా అయితే ఎట్లా అని ఆమె ఆందోళన. నేను హాస్పటల్‌లో చేరినా, తాను హాస్పిటల్‌లో చేరినా ఎట్లా అని ఆమె భయం. దిక్కు లేని పక్షుల్లా ఏమిటిదంతా అని హైరానాపడిపోతుంది పొద్దస్తమాను. అదే బాగా కుంగదీసినట్లున్నది. డాక్టరు మొన్న వచ్చి చూశాడు. ఏవేవో ఇంజెక్షన్లు చేశాడు. మందులు రాసిచ్చాడు. నిన్న మధ్యాహ్నం నుంచీ కర్పూర్వి కూడా మొదలైందిగదా. మధును తీసుకొని డాక్టరు దగ్గరకు వెళదామన్నా వీల్లేకపోయింది. ఇంతకూ నీవెలా రాగలిగావు? బాగా ఇబ్బంది అయిందా?'

'నేనిలాగా సాగర్ రోడ్ మీదుగా చుట్టి తిరిగి వచ్చాను. ఆటోలో డ్రైవర్ పక్కన కూచుని ఎలాగో వినయ్‌నగర్ సెంటర్లో దిగివచ్చాను. ఇలాగే మీకు కనపడి మిమ్మల్ని బాధ పెట్టటం ఎందుకని పక్కింటి మల్లికార్జునం గారింట్లో కాసిని మంచినీళ్ళడిగి, ఇంట్లో బిస్కెట్లూ,

బ్రెడ్డూ వుంటే తిని పడుకున్నాను. ఒళ్ళెరగని నిద్ర పట్టేసింది. పిన్ని గారికి ఇప్పుడేదైనా మందు వెయ్యాలా?'

'ఇంతకు ముందే ఒక టాబ్లెట్ వేశాను. నిద్ర పట్టటానికి సిరప్ ఏదో ఇచ్చాను. ఒక్కణ్ణీ ఉండలేక నిన్ను పిలిచాను నాయనా, ఏమీ అనుకోకు. కాసేపుండి వెళుదువు గాని. మల్లికార్జునం గారమ్మాయి నీవు వచ్చినట్టు చెప్పింది. ఈ మూడేళ్ల నుంచీ భగవంతుడు నిన్నే మాకు చూపించాడు. అన్నీ అయిందాకా పిల్లలు రారు కాబోలు. ఇప్పుడే ఈ కర్ఫ్యూ కూడా వచ్చింది, నా తోడల్లుడి పిల్లలు కాస్త సాయంగా రావడానికి కూడా వీలు లేకుండా!'

'మీరేమీ అధైర్య పడకండి బాబయ్య గారూ! నేనీ వారం ఉంటాను గదా. తొమ్మిదో రోజుకు వెళ్తాను మళ్ళీ. చిన్నవాణ్ణి కాబట్టి నా ప్రమేయం తక్కువే. అయినా ఇప్పుడన్నీ మారిపోయినయ్. అపర కర్మల్లో కూడా యాంత్రిక సౌకర్యాలు వచ్చేశాయి. ఒకరు చెప్పినట్లు ఒకరు చెప్పరు. ఒకరు చేసినట్లు ఒకరు చెయ్యరు. నిజంగా చూస్తే ఇవన్నీ అర్థం లేనివనిపిస్తున్నాయి. హృదయంతో చేయని ఏ పనైనా నిష్ఫలమే కదా! చేసే వాళ్లూ చేయించే వాళ్ళు కూడా శ్రద్ధ లేకుండా శాస్త్రార్థం తంతు నడుపుతున్నారు. డబ్బుమీద ఉన్న ఆసక్తి మనుషుల మీద లేనప్పుడివన్నీ ఎందుకూ? పెద్ద నగరాల్లో అయితే డబ్బు పుచ్చుకుని 'కేటరింగ్ వ్యవహారాల్లా' అన్నీ జరుపుకొనే సౌకర్యాలు కూడా వచ్చేశాయి. ఇక ముందు ముందు తండ్రులకూ కొడుకులకూ ఈ మాత్రం సంబంధాలు కూడా ఉండవు కాబట్టి ఈ వృత్తీ, ప్రవృత్తీ అంతరించిపోతేనే బాగుంటుందేమో'!

అనుద్దేశితంగా యజ్ఞనారాయణగారి హృదయం బాగా గాయ పరుస్తున్నట్లు గ్రహించలేకపోయాడు సారంగపాణి. వేసవి కాలపు ఇసుక చలమలో ఊరిన చెమ్మలాగా రెప్పలు దాటని తడిని ఆయన

తుడుచుకునే ప్రయత్నం చేయలేదు. మంచం మీద మహలక్ష్మమ్మగారు పక్కకు వొత్తిగిలే ప్రయత్నం ఆయన జీవచైతన్యాన్ని కాస్త స్పందింప చేసింది.

'నువు చెప్పింది అక్షరాలా నిజం నాయనా. అందుకు సరైన ఉదాహరణం నేనే. ఎప్పుడో జరగబోతుందంటున్నావు. నా జీవితంలో అది ఇప్పుడే నిజమైంది.'

సారంగపాణి ఎంతో పశ్చాత్తాపంతో నాలుక కరచుకొన్నాడు. తాను తొందరపడి ఇలా మాట్లాడి ఉండవలసిందికాదు అని విలవిల లాడి పోయినాడు. ఆయన్ను ఇప్పుడిక ఏవిధంగా ఓదార్చాలో అతడికి అర్థం కాలేదు.

ఎక్కడో దూరంగా కుక్క అరుస్తున్నది. దాన్ని అంది పుచ్చు కున్నట్లు వీధి మొదట్లో మరో కుక్క ఆలాపన సాగించింది. చీకటి రాత్రుల నవమి చంద్రుడు ఎర్రగా బెదురు బెదురుగా కిటికీ చువ్వల నుంచి రోగి శయ్యను పలకరిస్తున్నాడు. హఠాత్తుగా మహలక్ష్మమ్మ గారడిగింది- 'ఇవాళ తిథి ఏమిటి?'

'ఇప్పుడెందుకవన్నీ? నవమి కాబోలు. హార్లిక్సు కాస్త చెంచాతో వేస్తాను. తీసుకుంటావా?' అన్నారు ముసలాయన నెమ్మదిగా లేచి ఆవిడ పక్క మీదికి వంగి చూస్తూ.

'పెద్దవాడికి రేపు ఫోన్ చెయ్యండి. పదోనాటికైనా వస్తాడేమో!'

ముసలాయన నిశ్చేష్టుడైనాడు. 'నీకు గాని పిచ్చా? మనమే అక్కడికి వెళ్దాం' అని తడబడుతూ చెప్పాడు.

'నేను ఎక్కడికీ రాను. నా ఘటం ఇక్కడ ఈ విధంగా పోవా ల్సిందే' అని ఆమె ముఖకవళికలతో వీలైనంత స్పష్టంగా చెప్పింది. 'నీ పిచ్చిగాని ఫోన్ చేస్తే వాడు రెక్కలు కట్టుకుని వాలతాడా? ఇదొక

వింత ప్రపంచంలో మనం బతుకుతున్నాం. సంతానానికి తల్లిదండ్రులు అక్కరలేని ప్రపంచం ఇది. పక్షులు, పశువులులాగా బతకటం నేర్చుకోవాలి. అవి చాలా నయం. వాటికున్న జ్ఞానం, రికామీ తనం మనకేవీ? ఎక్కడెక్కడి గింజ నోటకరచుకొని తెచ్చి నోరు కూడా సరిగా తెరవలేని పిల్ల నోట్లో కుక్కుతుంది పిచ్చుక. కాస్త రెక్కరాగానే అది ఎగిరిపోతుంది. మన బతుకులూ అంతే ననుకోవాలి' అన్నారు యజ్ఞనారాయణగారు ప్రాపంచిక వేదాంత ధోరణిలో. సారంగపాణికి చాలా బాధనిపించింది. యజ్ఞనారాయణగారికి జీవితంలో ఏలోటూ లేదు అనుకుంటూ వచ్చాడు తాను ఇన్నాళ్లూ. కాని ఇంతకన్న పెద్దలోటు, అసంతృప్తి ఏముంటాయనిపించింది. ఆయన ముగ్గురి కొడుకులలో ఇద్దరు విదేశాలలో ఉన్నారు. ఒకడు ఉత్తరభారతంలో సరిహద్దులలో ఎక్కడో ఉన్నాడు. ఒక్క కూతురు తన భర్తతోపాటు పంజాబులో ఉంది. ఆ కూతురి కొడుకే మధు. తాత, అమ్మమ్మలకు కాస్త ఆసరాగా ఇక్కడ ఉంటున్నాడు. అక్కడ చదువు సరిగా సాగదని ఇక్కడ చదువుకుంటున్నాడు. తొమ్మిది పదేళ్ళ కుర్రాడు ఎప్పుడెప్పుడు తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళాలా అని వాడి ఆరాటం. అక్కడ చిన్న చెల్లెలుంది. తల్లిదండ్రులు రెండేళ్ళకో మూడేళ్ళకో ఒకసారి వచ్చి పోతుంటారు. యజ్ఞనారాయణ గారు ఇల్లు అమ్మేసి విదేశాలలో ఉన్న ఏ కొడుకు దగ్గరకో లేదా స్వదేశంలోని కొడుకు దగ్గరకో వెళ్ళాలని కలలుకంటూ ఉంటారు. అయితే ఆ కలలు ఎక్కువ భాగం పీడకలలు, పాడుకలలుగానే పరిణమిస్తూ ఉంటాయి. ఆయన్ను కదిలిస్తే ఎప్పుడూ ఆ విషయాలే చెపుతుంటారు.

అలసటతో, వేదనలతో యజ్ఞనారాయణగారి రెప్పలు వాలిపోతున్నాయి. పక్కింటి ప్లీడరు గారింట్లో గోడగడియారం రెండు గంటలు కొట్టి ఊరుకుంది. కాలం ఘనీభవించినట్లుగా ఉంది. ఆమె వొంటిమీద దుప్పటి సవరించాడు ముసలాయన.

'నువ్వెళ్ళునాయనా! పాపం, ఈ నాలుగు రోజులూ సరిగా నిద్ర కూడా పోయి ఉండవు. నాకిది అలవాటే కదా? మళ్ళీ పొద్దున ఒకసారి కనపడు. ఏదైనా నర్సింగ్‌హోమ్‌లో చేర్పిద్దాం. ఎన్నాళ్ళు ఒకరి దయా ధర్మాలపైన ఆధారపడి ఉండాలి నాయనా? మల్లికార్జునంగారింట్లో నుంచో రాఘవులు గారింటి నుంచో పథ్యం పానం తీసుకెళ్ళాలి కదా. ఆమె దగ్గర ఎవరో ఉండాలి కదా. మధు చిన్నవాడు కదా. మీకిప్పుడే కష్టం వచ్చిపడె. లేకపోతే భారతి అయినా ఆమెకు అండగా ఉండేది. నీవే నా కొడుకు వనుకుంటాను. ఈసారి కాస్త నన్ను గట్టెక్కించు. మాలో ఎవరమో ఒకరం రాలిపోయామా - ఫిరోజ్‌పూరో, మాంట్రియలో ఎక్కడికో అక్కడికి బతికి వున్న పదార్థం రవాణా కావల్సిందే కదా!'

ఆ పరిస్థితులలో మానసికంగా ఆయన అంత కుంగిపోయి ఉండగా తానెంత అలసటతో ఉన్నా విడిచిపెట్టి పోవాలనిపించలేదు సారంగపాణికి. 'ఫరవాలేదు. నేను మీకంటె నలభై ఏళ్ళు చిన్నవాణ్ణి. పొద్దున పిన్నిగారిని నర్సింగ్ హోమ్‌లో చేర్పించే ఏర్పాటు చేద్దాం. అయితే ఇప్పుడే కర్ఫ్యూ ఒకటి వచ్చి పడెగదా!' అన్నాడు సారంగ పాణి.

'ఏమిటో నాయనా! నా జీవితంలో చరమాంకం ఇలా ముగియ వలసి ఉంది అని నే నెప్పుడూ అనుకోలేదు. బదిలీ మీద పది ఊళ్ళు తిరిగి నేను ముప్పై ఏళ్ళు ఉద్యోగం చేశాను. అయినా మా అమ్మను నాన్నను నేను ఏనాడు నిర్లక్ష్యం చెయ్యలేదు. సంవత్సరంలో ఎప్పుడో ఒకప్పుడు పదిరోజులో పదిహేను రోజులో శెలవు పెట్టి స్వగ్రామం వెళ్ళేవాణ్ణి. వాళ్ళ బాధలు భయాలు ఏమిటో కనుక్కుంటూ ఉండే వాణ్ణి. నా చేతనైనంతలో వాళ్ళకు చిన్న చిన్న సదుపాయాలు కలి గిస్తూ ఉండేవాడ్ని. నేను ఉన్న చోటికి వచ్చి ఉండమంటే వాళ్ళు వచ్చే వాళ్లు కారు. వాళ్ళకు ఒకరకమైన జీవితం, కొన్ని పద్ధతులు, మరి

కొన్ని నమ్మకాలూ ఉండేవి. అవి ఎక్కడ చెదరిపోతాయోనని భయ పడిపొయ్యేవాళ్ళు.'

'అవును బాబాయిగారూ! మీరిప్పుడు మీ పల్లెటూరు బొడ్డుపల్లికి పోయి ఉండగలరా? అట్లానే మీ పిల్లలు ఇప్పుడు వచ్చి హైదరాబాదులో ఉండలేరు, అని ఎందుకనుకోకూడదూ! వాళ్ళకు ఇక్కడ ఉద్యోగాలు దొరకవు. వాళ్ళ పిల్లలకు చదువుకోవటానికి అవకాశాలుండవు. ఇక్క డకు వచ్చి ఏం చెయ్యమంటారు?'

'నేను ఎవరినీ తప్పు పట్టటంలేదు నాయనా! వాదించటానికి రెండు పక్షాలకూ కొన్ని యుక్తులుంటూనే ఉంటాయి. మా పిల్లలు నీలాగే వాదిస్తారు. ఆ దేశంలో మా పిల్లలు బతకలేరు, అక్కడకు వచ్చి ఉండటం మా పిల్లలకు ఇష్టంలేదు అంటారు. ఇది సరి అయిన ధోరణి కాదు. తాత తండ్రులు పుట్టి పెరిగిన దేశంమీద ఆ మాత్రం మమకారం లేకపోతే ఎట్లా? మన పిల్లలమీద మనకెంత మమకారం ఉంటుందో మన తల్లిదండ్రులకి మన మీద కూడా అంతకన్న ప్రేమ ఉంటుందని తెలియకపోవడం ఇప్పటి పిల్లల్లో కాస్త ఎక్కువగా కన్పి స్తున్నది. మా పెద్దబ్బాయి రామచంద్రం మమ్మల్ని బలవంతాన మాంట్రియల్ తీసుకొని వెళ్ళాడు. అక్కడున్న ఆర్నెల్లు మాకది జైలు జీవితంలాగా అనిపించింది. అక్కడే నేను చనిపోతే నా అస్తికలను వాడు ఏ నదిలో కలుపుతాడు? ఎంతసేపటికీ నాకు మా ఊరే జ్ఞాపకం వచ్చింది. కష్టానికి సుఖానికి అందరూ కలిసి బతికేవారు. మా నాన్న గారు మాకోసం ఎంత కష్టపడ్డారు! నేను రిటైరైన తర్వాత ఆయన కోసమే రెండేళ్ళు పల్లెటూరిలో ఉన్నాను. నా పెద్ద కొడుకు అమెరికా వెళ్ళి పదహారేళ్ళైంది. ఏ రెండుసార్లు మాత్రమో వచ్చాడు. అదీన్నీ అత్తగారింటి వైపు బంధువుల పెళ్ళిళ్ళకు. ఒకసారి మాత్రం మమ్మల్ని బలవంతంగా తీసుకొని వెళ్ళాడు. అక్కడ మేము ఇమడలేమని

పించింది. నలుగురు కొడుకులు కావాలని కోరుకోవాలి, ఒకరైనా గయ వెళ్ళి తాతతండ్రులను స్మరించుకొంటాడేమో నని భారతంలో వుంది. ఇప్పుడది కూడా తప్పయి పోయింది కదా? పోను పోను పదిమంది బంధువులు ఒకచోట కలుసుకోవటం కూడా పడదేమో!'

'ఏం కలుసుకోకపోతే! మీ రోజుల్లో మాత్రం అంతా సుఖ పడ్డారా?'

'అట్లా అంటే నేను ఏం చెప్పేది నాయనా? మా నాన్నగారు పోయినప్పుడు చెట్టు సగానికి విరిగిపోయి పైన పచ్చని భాగమంతా నేలపాలై మొండిలాగా నేను మిగిలాననిపించింది. ఏడాదిదాకా నేను కోలుకోలేకపోయాను. ఎక్కడ ఏ మంచి వాక్యం చదివినా, ఏ మంచి భావం తోచినా, తాజాగా పండ్లు, పూలు కనిపించినా, దేవాలయ గోపురం అంత దూరాన కనిపించినా, మంచి సంగీతం విన్నా, ఉదయం గాని సాయంత్రం కాని ప్రశాంతమైన దృశ్యం చూసినా మా నాన్న జీవితంలో నాకోసం పడిన తపన, చేసిన త్యాగం, నా చుట్టూ ఆయన అల్లుకున్న అనుబంధమే జ్ఞాపకానికి వచ్చేవి. ఆయనకు చేయవలసినంత సేవ చేయలేకపోయానని నేనెంతో బాధపడేవాణ్ణి. ఇప్పుడు నా పిల్లలకు అలాంటి ఆలోచనలు కూడా లేవు కదా! ఈ మార్పు కోరుకోదగిందే నంటావా నీవు?' అన్నారు యజ్ఞనారాయణగారు, పాలిపోయిన పెదవులపై జీవంలేని వేదనను వ్యక్తం చేస్తూ.

తెల్లవారే సరికి మహాలక్ష్మమ్మగారు లేచి కూచుంది. కర్ఫ్యూ సడలించారని తెలిసి సారంగపాణి ఆఫీసుకు వెళ్ళాడు. కాని, ఆఫీసు నుంచి వచ్చేసరికి దిగ్భ్రమ కలిగించే వార్త- యజ్ఞనారాయయణగారికి స్పృహ లేదు! మర్రోజు ఉదయం అంబులెన్సు వస్తుందని చెప్పాడు మధు. తన గదిలో అడుగు పెట్టటానికి మనస్కరించలేదు సారంగ పాణికి. (జాగృతి-1991)